'గో గీత డ్యాకుమెంటరీ' ప్రదర్శన

చిక్కడపల్లి: శ్రీ భారతి ఫౌండేషన్, శ్రీ భారతి మ్యూజిక్ అకాడమీల ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో సోమవారం 'గో గీత డ్యాకుమెంటరీ'ని ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకు విశ్రాంత ఐఏఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా హాజరై తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ధర్మాన్ని ఆచరిస్తే అది మనల్ని కాపాడుతుందని అన్నారు. గో సంరక్షణ ఉద్యమంగా నడుపుతున్న గోపాలకృష్ణ ఈ డాక్యుమెంటరీ తీయడం అభినందనీయమని అన్నారు. దీనిని ఇతర భాషల్లో అనువదించి జాతీయ స్థాయిలోనూ ప్రచారం చేయాలని సూచించారు. ఆచార్య టి.గౌరీశంకర్ మాట్లాడుతూ... భారతీయులు గో సంరక్షణను ఉద్యమంగా కొనసాగించాలన్నారు. గతంలో లక్ష్మణరేఖ వంటి ఉత్తమ సినిమాలు తీసి ఆ తర్వాత ఆధ్యాత్మిక మార్గంలో గో సేవకు అంకితం అయ్యారని కొనియాడారు. అనంతరం నిట్టల గోపాలకృష్ణ గో స్వామి పురస్కారాన్ని ప్రదానం చేసి సన్మానించారు.

అలరించిన 'శేషు పాటల బహార్'

చిక్కడపల్లి: ప్రముఖ గాయకుడు టి.శేషగిరిరావు ఆధ్వర్యంలో 'శేషు పాటల బహార్'శీర్షికతో 12 గంటల పాటు నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది. ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కళాభారతి సిటీ కల్చరల్ సెంటర్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో గాయనీగాయకులు పాటలను మధురంగా ఆలపించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీనియర్ పాత్రికేయుడు పురుషోత్తం నారగొని ఈ సందర్భంగా శేషగిరిరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు ఎంపీఎస్ లక్ష్మి, ఉష, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్ పరిధిలోని చిత్రాలనగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి వర్గ సభ్యుడు దశరథ్ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ముషీరాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా దశరథ్ మాట్లాడుతూ... చిత్రాలనగర్‌లో 30ఏళ్ల క్రితం నిర్మించిన డ్రైనేజీ నుంచి నిత్యం మురుగు పొంగిపొర్లుతోందని అన్నారు. అనేక సందర్భాలలో మంచినీటి పైప్‌లైన్‌లోకి మురుగు కలవడంతో కలుషిత నీటి సరఫరాతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి పెరిగిన జనాభాకు అనుగుణంగా నూతన డ్రైనేజీ పైప్‌లైన్ వేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో చిత్రాలనగర బస్తీవాసులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ జోన్ కార్యదర్శి ఆర్.వెంకటేష్, కార్యదర్శి వర్గ సభ్యులు పి.విమల, బాబు, రమేష్, మహేందర్, లెనిన్, చారి, రోజా, బాలమణి, మల్లయ్య, కోటి తదితరులు పాల్గొన్నారు.

వినికిడి లోపాలపై అవగాహన

ముషీరాబాద్: వినికిడి సమస్యను సకాలంలో గుర్తిస్తే పరిష్కరించవచ్చని భోలక్‌పూర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డా. మనోజ్‌రెడ్డి అన్నారు. సోమవారం ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా యూపీహెచ్‌సీలో వినికిడి లోపాలపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శబ్ద కాలుష్యం బారిన పడకుండా ఉండేందుకు ఇయర్ ప్లగ్స్ ఉపయోగించడం అలవాటు చేసుకోవాలన్నారు. ధూమపానం వల్ల వినికిడిపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. వ్యాయామం చేయడం వల్ల రక్త ప్రసరణ పెరిగి తగినంత ఆక్సిజన్ చెవిలోని అంతర్గత అవయావలకు కూడా చేరుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం విజయకుమారి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కూల్చిన షాపు ప్రహరీ నిర్మాణం

ముషీరాబాద్: ముషీరాబాద్ జీహెచ్‌ఎంసీ పార్కు సమీపంలో హోమ్ ఫుడ్ షాపు ప్రహరీని అరబిందో భవన్ నిర్వాహకులు అర్ధరాత్రి బుల్డోజర్‌తో కూల్చివేసిన విషయం విదితమే. సోమవారం బీజేపీ నాయకులు నవీన్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు శివముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు జనిగె శ్రీనివాస్‌యాదవ్ తదితరులు షాపు యజమాని రాకేష్‌గౌడ్‌తో కలిసి అరబిందో భవన్ నిర్వాహకులతో మాట్లాడారు. దీంతో వారు కూల్చిన గోడ పునర్‌నిర్మాణానికి అంగీకరించారని తెలిపారు. హోమ్‌పు డ్ షాపు కూల్చివేతపై స్థానికులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తూ అరబిందో భవన్ నిర్వాహకులతో వాగ్వావాదానికి దిగారు. దీంతో ముషీరాబాద్ పోలీసులు ఇరువురికి సర్ది చెప్పడంతో వెనుదిరిగి వెళ్లిపోయారు.

పరారీలో రాగి వీరాచారి

ముషీరాబాద్: హెబ్రోన్ చర్చిలో పలు వివాదాలకు కేంద్రబిందువుగా ఉన్న రాగి వీరాచారి ప్రస్తుతం పరారీలో ఉన్నారని బ్రదర్ ఎం.మాధవరెడ్డి అలియాస్ అద్దంకి ఇమానియేల్, బ్రదర్ సామ్సన్, బ్రదర్ ముత్తయి, బ్రదర్ రేపాక సైమన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఆయన కోసం భద్రాద్రి కొత్తగూడం జిల్లా పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల జీతాలను దొంగిలించారనే ఆరోపణపై రాగి వీరాచారిపై 1992లో అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. తాజాగా 2025 ఫిబ్రవరి 24వ తేదీన జిల్లా కోర్టు కల్పించుకుని మరోసారి రాగి వీరాచారిని పట్టుకొని శిక్షించాల్సిందిగా ఆదేశాలు ఇచ్చిందన్నారు. కోర్టు ఆదేశాలతో పోలీసులు అతడి కోసం గాలిస్తున్నారని తెలిపారు.



భక్తిశ్రద్ధలతో గణపతి హోమం

నల్లకుంట: నల్లకుంట శంకరమఠంలో సోమవారం చవితిని పురస్కరించుకొని శక్తి గణపతికి ఆది పూజలు నిర్వహించారు. చంద్రమౌళీశ్వర స్వామి, శారదామాతకు విశేష పూజలు చేశారు. అనంతర మఠం ప్రాంగణంలోని యాగశాలలో 'గణపతి హోమం'నిర్వహించారు. నవ ధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు హోమంలో వేసి ఆవు నెయ్యితో పూర్ణాహుతి చేశారు. భక్తులు పెద్ద సంఖ్య వచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శృంగేరి శారదా పీఠాధీశ్వరులు భారతీతీర్థ మహాసన్నిధానం, విధుశేఖర భారతీ సన్నిధానం అనుగ్రహ ఆశీస్సులతో పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు.

నేడు దుర్గా సప్తశతి పారాయణం..

ఈ పూజా కార్యక్రమాలు నెల రోజుల పాటు నిత్యం ప్రత్యేక పూజలు, పారాయణాలు ఉంటాయని శంకరమఠం నల్లకుంట బ్రాంచ్ హెడ్ కృష్ణారావు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం 7.30 గంటలకు దుర్గా సప్తశతి పారాయణ ఉంటుందన్నారు.





సేవే లక్ష్యంగా రాజకీయాలు చేయాలి

- పేదలకు విద్యా, వైద్యం ఉచితంగా అందించాలి
- వ్యక్తిగత అభివృద్ధి కోసం రాజకీయాల్లోకి రావొద్దు
- బండారు వైష్ణవ్ జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపట్టాం
- హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ





కవాడిగూడ: నాణ్యమైన విద్యా, ఉచిత వైద్యాన్ని పేదలకు అందించినప్పుడే సమాజం ఉన్నత స్థితి వైపు పయనిస్తుందని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వాలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సోమవారం కవాడిగూడ డివిజన్ రోటరీ కాలనీలో బండారు వైష్ణవ్ జయంతిని పురస్కరించుకొని బండారు వైష్ణవ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా బస్తీవాసులు అధిక సంఖ్యలో వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

◆ అనంతరం బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ... యువతకు నైపుణ్యం, ఉపాధి కల్పన, ప్రజలకు ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా పెట్టుకునే రాష్ట్రాలు అభివృద్ధిలో నిజమైన ప్రగతిని సాధిస్తాయని అన్నారు. రాజకీయ నాయకులు సమాజ సేవే లక్ష్యంగా రాజకీయాలు చేయాలని సూచించారు. వ్యక్తిగత అభివృద్ధి కోసం రాజకీయాల్లోకి రావొద్దన్నారు.

◆ కేంద్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా అనేక మందికి నైపుణ్య శిక్షణ ఇస్తోందన్నారు. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయూతను అందిస్తోందని తెలిపారు. ఏప్రిల్ 14 నాటికి రోటరీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహ స్థానంలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. డా బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

◆ ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, బండారు వైష్ణవ్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షురాలు బండారు విజయలక్ష్మి, కార్పొరేటర్లు జి.రచనశ్రీ, సుప్రియా నవీన్ గౌడ్, పావని వినయ్‌కుమార్, సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్, నాయకులు రమేష్‌రాం, జి.వెంకటేష్, సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, పరిమళ్‌కుమార్, రోటరీ కాలనీ అధ్యక్షుడు బండారు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గోల్నాక లంకబస్తీలోని ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ బ్యాగ్ కిట్లను అందజేస్తున్న బండారు దత్తాత్రేయ



'డబ్బు కంటే చదువే విలువైనది'

అంబర్‌పేట: డబ్బు కంటే చదువే విలువైందని తల్లిదండ్రులు గుర్తించి పిల్లలను బాగా చదివించాలని హరియాణా గవర్నర్ బండారు దత్తత్రేయ కోరారు. సోమవారం తన కుమారుడు బండారు వైష్ణవ్ జయంతిని సందర్భంగా గోల్నాకలోని లంక ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ బ్యాగ్ కిట్లను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉల్లిగడ్డలు అమ్మే మా అమ్మకు పనిలో సహాయం చేస్తూ చదువుకున్నానని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేద విద్యార్థులే చదువుతారని అన్నారు. వారికి తమ ఫౌండేషన్ సహాయ సహకారాలు అందించడంలో వెనకడుగు వేయదని అన్నారు. విద్యార్థులు చదువును ఎప్పుడూ నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. విద్యార్థుల్లో జాతీయ భావాన్ని పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ బండారు విజయలక్ష్మి, మాజీ మంత్రి కృష్ణయాదవ్, పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు దీపక్‌రెడ్డి, నాయకులు గౌతమ్‌రావు, ఆనంద్‌గౌడ్, కృష్ణగౌడ్, కార్పొరేటర్ ఉమా రమేష్ యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, శ్యామ్‌రాజ్, మూల రవీందర్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

9న అఖిల భారత పద్మశాలి మహాసభలు

కాచిగూడ: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో మార్చి 9వ తేదీన ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న అఖిల భారత పద్మశాలి మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి పిలుపునిచ్చారు. సోమవారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 17వ అఖిల భారత పద్మశాలి మహాసభ, 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అఖిల భారత మహాసభలకు ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అనిల్‌కుమార్, సంఘం జాతీయ గౌరవ అధ్యక్షుడు శ్రీధర్, ఎస్.సుంకర్ వార్ ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి గడ్డం జగన్నాథం, రామచంద్రరావు, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి కొక్కుల దేవేందర్, డాక్టర్ పుట్ట పాండురంగయ్య, చిలువేరు సునిత, బాసాని పద్మ, బండారి లక్ష్మి, అవ్వారు భాస్కర్, కొండ సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి

ప్రజాస్వామ్య రక్షణకు ప్రత్యేక కార్యక్రమాలు

కవాడిగూడ: రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, దేశ రక్షణకై మార్చి 23 నుంచి ఏప్రిల్ 14 వరకు దేశవ్యాప్తంగా వివిధ రూపాలలో కార్యక్రమాలు చేపట్టనున్నట్లు అఖిల భారత శాంతి సంగీభావ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దిడ్డి సుధాకర్ వెల్లడించారు. సోమవారం లిబర్టీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శాంతిదూత, ఫిడేల్ క్యాస్ట్రో శతజయంతి ఉత్సవాలు, హిరోషిమా అమరులకు నివాళి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. 13వ ఇండో వియత్నం ఉత్సవాలను ఏపీలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ దిడ్డి సుధాకర్

మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

ముషీరాబాద్: రంజాన్ పండుగను పురస్కరించుకొని నియోజకవర్గంలోని 36 ప్రధాన మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాటు చేసే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. సోమవారం ముషీరాబాద్‌లోని ఏక్ మినార్ మసీదును సందర్శించారు. ప్రార్థనలు ముగించుకొని బయటకు వచ్చిన వారిని కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మసీదుల వద్ద ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే అన్నారు. తమ పార్టీ కార్యకర్తలు సైతం నిత్యం అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, శ్రీధర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, శివముదిరాజ్, నాగేష్‌ముదిరాజ్, పూసగోరఖ్‌నాథ్, పట్నం నాగభూషణంగౌడ్, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

జెమినీకాలనీలో అన్నదానం

ముషీరాబాద్: ఆధ్యాత్మిక కార్యక్రమాలు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. జెమినీకాలనీలోని సాయిబాబా దేవాలయం 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్ చారి తెలిపిన వివరాల ప్రకారం... మలక్‌పేట - కాచిగూడ రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (50) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదగాలి





ఫేర్‌వెల్ డేలో మాట్లాడుతున్న రమణకుమార్, విద్యార్థుల నృత్య ప్రదర్శన

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: అంబేడ్కర్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా అంబేడ్కర్ విద్యాసంస్థల జాయింట్ సెక్రటరీ రమణ కుమార్ మాట్లాడుతూ... సుదీర్ఘకాలం పాటు ఒక పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకుని పాఠశాలను, గురువులను విడిచి వెళ్లడం విద్యార్థులకు ఎంతో బాధగా ఉంటుందన్నారు. ఇది ప్రతి విద్యార్థి జీవితంలో ఒక ఫేజ్ అని అన్నారు. పాఠశాల విద్యాభ్యాసం తర్వాత ఇంటర్ ఆ తర్వాత డిగ్రీలో సైతం కళాశాలను వదిలి ఉన్నత చదువులకు వెళ్లాల్సి వస్తుందన్నారు. గురువులు చెప్పిన పాఠాలు, జీవిత సత్యాలను గుర్తించుకుని అనుకున్న లక్ష్యానికి చేరుకోవాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ విఠలాచారి మాట్లాడుతూ... నిరంతర కృషి చేసేవారు ఎప్పటికీ విజయాలను సాధిస్తూనే ఉంటారన్నారు. కళాశాల డైరెక్టర్ విష్ణుప్రియా మాట్లాడుతూ... ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

కవాడిగూడ: బీమా మైదాన్‌లోని శ్రీసాయిరాం హైస్కూల్ ఆవరణలో సోమవారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన రేయిన్ హార్వెస్టింగ్ సేంద్రియ వ్యవసాయం, వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్, హార్ట్ బ్లడ్ పంపింగ్, ఫైర్ సెన్సార్ తదితర ప్రాజెక్టులు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యుడు వి.శ్రీనివాస్‌రెడ్డి, దోమలగూడ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రాజెక్టులను తిలకించారు. ఆ ప్రాజెక్టుల ముఖ్య ఉద్దేశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికితీయడానికి దోహదపడుతాయని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేష్, సలంద్రి దిలీప్‌యాదవ్, ఎంసీ మహేందర్‌బాబు, ప్రభాకర్ గంగపుత్ర తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ జి.రచనశ్రీ

నిస్వార్థంగా వైద్యసేవలు అందించడం అభినందనీయం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వీవీఎస్ రావు

నల్లకుంట: పేదలకు నిస్వార్థంగా వైద్య సేవలు అందిస్తున్న అభయ నియో బీబీసీ ఆస్పత్రి సేవలు అభినందనీయమని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వీవీఎస్ రావు చెప్పారు. ఆదివారం రాత్రి నల్లకుంట ఓయూ ఎన్‌సీసీ చౌరస్తా సమీపంలోని ఓ హోటల్‌లో విద్యానగర్‌లోని అభయ నియో బీబీసీ ఆస్పత్రి 15వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం విశిష్ట అతిథులుగా విచ్చేసిన విశ్రాంత డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ ఏవై చారి, అమలాపురం మాజీ ఎమ్మెల్యే వీఎం .అబ్రహం మాట్లాడారు. అనంతరం బీబీసీ ఆస్పత్రి ఎండీ డాక్టర్ మంచుకొండ రంగయ్య మాట్లాడుతూ.. నగరంలో వివిధ ప్రాంతాలకు ఉచితంగా అంబులెన్స్ సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఆరోగ్య శ్రీ కింద కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు బి. సురేష్ కుమార్, మహేందర్ రెడ్డి, శ్రీధర్, శ్రీరామ్, నరేందర్ రావు, ప్రభాకర్ రావు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'హైదరాబాద్'ను రెండో రాజధాని చేయాలి

కాచిగూడ: దేశానికి హైదరాబాద్‌ను రెండో రాజధాని చేసినప్పుడే దక్షిణాది ప్రాంతం అభివృద్ధి చెందుతోందని దక్షిణాది జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ప్రొ. డా. గాలి వినోద్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో సుప్రీం కోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. హైదరాబాద్‌ను రెండో రాజదానిగా చేయకుండా బడ్జెట్ పెరగదని, రెండో రాజధాని చేసే వరకు ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. దక్షిణాదిని కాపాడటానికి 'నాన్ ముల్కి నార్త్ ఇండియా గో బ్యాక్'నినాదంతో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈనెల 5వ తేదీన మేధావుల సదస్సు, ఇందిరాపార్క్ వద్ద ఒక్కరోజు నిరాహార దీక్షను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. 'గుడ్ మార్నింగ్ హైదరాబాద్'పేరుతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పర్యటించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి పరిష్కరించే విధంగా కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.సంజీవయ్య, బాలస్వామి, బాలరాజు, శ్రీకళ, షకీల్, రాములు, పవన్ చక్రవర్తి, రవీంధర్, కోటేశ్వర్ రావు, సంపత్, వెంకటేష్, సామ్యుల్ రాజు, హమీద్ ఆలీ, రాంప్రసాద్, ఆశయ్య, నర్సింహ్మ, హనుమంతు, ప్రకాష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధిని కాంగ్రెస్ అడ్డుకుంటోంది

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని కాంగ్రెస్ అడ్డుకుంటోందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అసహనం వ్యక్తం చేశారు. స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ పేరిట కొన్ని రోడ్లకు నిధులు మంజూరయ్యాయని వాటిని కాంగ్రెస్ ముఖ్య నాయకులు మాత్రమే ప్రారంభించారంటూ కాలయాపన చేస్తున్నారని అన్నారు. సోమవారం బాగ్అంబర్‌పేట డివిజన్‌లో రూ.40 లక్షల అంచన వ్యయంతో సాయిబాబా ఆలయం నుంచి రామకృష్ణానగర్ వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులను కార్పొరేటర్ బి.పద్మా వెంకట్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు.

స్థానిక కాంగ్రెస్ నేతలు ఆదేశాలు ఇవ్వడం దారుణం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేక నిధులు మంజూరుతో జరుగనున్న పనుల ప్రారంభోత్సవానికి స్థానిక కాంగ్రెస్ నేతలు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనుల ప్రారంభానికి కాంగ్రెస్ మంత్రి పొన్నం ప్రభాకర్, నాయకులు వి.హనుమంతరావు, రోహిన్‌రెడ్డి వస్తే తప్ప ప్రారంభించొద్దని స్థానిక కాంగ్రెస్ నేతలు ఆదేశాలు ఇవ్వడం దారుణమన్నారు. దీంతో ప్రజా సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

వీహెచ్ ఇంటి ముందు ధర్నా చేయాల్సి ఉంటుంది..

ప్రజల అభివృద్ధిలో రాజకీయాలు ఎందుకని తానే స్వయంగా కాంగ్రెస్ ముఖ్య నాయకులకు ఫోన్ చేసినా వారు స్పందించడంలేదని తెలిపారు. ఇలాంటి చర్యలు కొనసాగితే కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు ఇంటి ముందు ధర్నా చేయాల్సిన పరిస్థితి వస్తుందని స్పష్టం చేశారు. అనంతరం డీడీ కాలనీ, సోమాసుందర్‌నగర్‌లో ఎమ్మెల్యే పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బి. వెంకట్‌రెడ్డి, శ్రీరాములు ముదిరాజ్, చంద్రమోహన్, గెల్వయ్య, శ్రీనివాస్, రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



బాగ్అంబర్‌పేట చౌరస్తాలో బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ పద్మ